మీ రుణం తీర్చుకుంటా

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ఎమ్మెల్యే బీఎల్ఆర్‌ను సత్కరిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్ తదితరులు

కుషాయిగూడ: నన్ను ఆధరించి ఎమ్మెల్యేగా గెలిపించిన మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ వాసుల రుణం తీర్చుకుంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. హెచ్‌బీకాలనీలో స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్, పార్టీ అధ్యక్షుడు గుండారపు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కృతజ్ఞత సభను నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ వ్యాప్తంగా ఉన్న కాలనీ సంక్షేమ, కుల సంఘాల ప్రతినిధులు హాజరై ఎమ్మెల్యేగా గెలుపొందిన బండారిని ఘనంగాసత్కరించారు. ఈ సందర్భంగా బీఎల్ఆర్ మాట్లాడుతూ ఆరువేలకు పైగా మెజారిటిని అందించిన డివిజన్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, వంజరి ప్రవీణ్, బోదాసు రవి, భాగ్యమ్మ, గుమ్మడి జంపాల్‌రెడ్డి, దూసరి నవీన్‌గౌడ్, రమేష్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖకు అభినందనలు



కుషాయిగూడ: రాష్ట్ర క్యాబినెట్ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మంత్రి కొండా సురేఖ, మురళి దంపతులను ఆదివారం మీర్‌పేట్–హెచ్‌బీ కాలనీ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు బుడిద శ్రావణ్‌కుమార్‌గౌడ్, పోలేపాక అంజయ్య, పోలగాని శ్రావణ్‌కుమార్‌గౌడ్, ఇంజ మల్లేష్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మైమరిపించిన కూచిపూడి నృత్యం



రామంతాపూర్ : ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం ప్రముఖ కూచిపూడి గురువులు తాడూరి రేణుక శిష్య బృందం ఆదివారం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆద్యంతం అలరించింది. ఈ నృత్యాలలో శ్లోకాభినయం శంకరే శ్రీగిరి శివ స్తుతి నమశ్శివాయతే లింగాష్టకం అదిగో అల్లదిగో అంశాలతో కూడిన ముత్యాలను సాయి సుదీప్తి తులసి భ్రమరి తేజస్వి నైనిక శృతి ఆరాధ్య అవని సాధ్య హరి సమిత మొదలైన నృత్యకారులు ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్



రామంతాపూర్ : భరత్ నగర్‌లోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో ఆదివారం విద్యార్థులు 280 వంటకాల స్టాళ్ళతో... బొజ్జ భోజనం పేరిట నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ సూరం రాంరెడ్డి మాట్లాడుతూ వివిధ ఆహార పదార్థాలలో ఉన్న పోషక విలువలతో పాటు వివిధ వంటకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఇటువంటి కార్యక్రమాలు చేపడతామన్నారు.

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ



మల్లాపూర్ : మల్లాపూర్ డివిజన్ పరిధిలోని సూర్యనగర్ కాలనీలో శ్రీ గణపతి దేవాలయం వద్ద సందీప్ స్వామి నిర్వహించిన అయ్యప్ప మహా పడిపూజ వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరయ్యారు.

ఆరోగ్యశ్రీ పెంపు ప్రారంభం

మేడ్చల్: ఎన్నికలలో హామీ ఇచ్చిన విధంగా ప్రభుత్వంలోకి అమలులోకి తెచ్చి న ఆరోగ్య శ్రీ పెంపు కార్యక్రమాన్ని మేడ్చల్ లో జిల్లా పరిషత్ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి ప్రారంభించారు. పట్టణంలోరని కమ్యూనిటీ ఆసుపత్రి వద్ద వైద్యులు, స్థానిక నాయకులతో కలిసి ఆయన పథకాన్ని ప్రారంభించారు. గతంలో ఆరోగ శ్రీ పథకం కింద రూ.5లక్షల వరకే చెల్లింపులు ఉండేవని సీఎం రేవంత్‌రెడ్డి అందరికి మరింత మెరుగైన వైద్యం కోసం పథకం పరిమితి ని రూ.5 లక్షల నుండి రూ.10లక్షలకు పెంచారని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీహెంఅండ్‌హెచ్‌ఓ ఆనంద్, స్థానిక కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం నూతన కమిటీ ఎన్నిక

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ మున్నూరుకాపు సంఘం నూతన కమిటీ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఘట్‌కేసర్‌లో నిర్వహించిన సంఘ సమావేశంలో సంఘ అభివృద్ధి, భవన నిర్మాణం ఇతర సమస్యలపై సభ్యులు చర్చించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నందు పటేల్, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు రవికుమార్, రామమోహన్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రక్తదాన శిబిరం

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని సెయింట్ అంథోని పాఠశాల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్య యాదవ్ ప్రారంచారు. అనంతరం వంద మందికి పైగా శిబిరంలో పాల్గొని రక్త దానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానంతో ఇతరుల ప్రాణాలను కాపాడవచ్చని ప్రతి ఒక్కరూ రక్తం దానం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మెన్ మాదవరెడ్డి, కౌన్సిలర్ జహంగీర్, ఉపాధ్యాయులు, వైద్యులు పాల్గొన్నారు.

కీసరగుట్ట స్వామివారికి పుష్పార్చన





స్వామివారికి పుష్పార్చన నిర్వహిస్తున్న దృశ్యం

కీసర: కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాల ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో చివరి ఆదివారం కన్నుల పండువగా నానావిధపుష్పార్చన నిర్వహించారు. కార్తీకమాసం అందులో ఆదివారం సెలవుదినం కావడంతో నగరంలోని వివిధ ప్రాంతాలనుండి పెద్ద ఎత్తున భక్తులు కీసరగుట్టకు తరలివచ్చారు. యాగశాల, ప్రధాన గోపురానికి ఎదురుగా ఉన్న శివలింగాలకు పసుపుకుంకుమ, పాలతో అభిషేకాలు నిర్వహించి కార్తీకదీపాలను వెలిగించారు.



హాజరైన భక్తులు

వనభోజనాలు

ఆదివారం కీసరగుట్టలో పెద్ద ఎత్తున వివిధ కులసంఘాల ఆధ్వర్యంలో కార్తీక వనబోజనాలు నిర్వహించారు. కాప్రాకాపు ఐక్యవేదిక , నాగారం పద్మశాలిసంఘం తోపాటు, వివిధ కాలనీల అసోషియేషన్ ఆధ్వర్యంలో గుట్టలో కార్తీక వనబోజనాలు నిర్వహించారు.

ఆరోగ్యశ్రీ పరిమితి పెంచడం అభినందనీయం

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

రామంతాపూర్ : ఉప్పల్‌లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాజీవ్ ఆరోగ్య శ్రీ, మహాలక్ష్మీ పథకాలను ఆదివారం ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేట్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేద, మధ్య తరగతి ప్రజల చికిత్సల కోసం ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం వ్యయం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడం, అదే విధంగా మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలందరికీ ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడికైనా ప్రయాణించడానికి ప్రారంభించిన సంక్షేమ పథకాలు అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ మనోహర్, డాక్టర్ నారాయణ, మెడికల్ ఆఫీసర్ సౌందర్య లత పాల్గొన్నారు.



ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఘనంగా శ్రీవారి కళ్యాణం



మల్కాజిగిరి: మల్కాజిగిరి ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వెంకటేశ్వర దేవస్థానంలో శ్రీవారి కళ్యాణం ఘనంగా జరిగింది. ప్రధాన అర్చకులు ముడుంబై వెంకటరమణాచార్యులు, అర్చకులు తులసి రమణాచార్యులు కళ్యాణమహోత్సవాన్ని నిర్వహించారు. ప్రతి నెలా రెండవ ఆదివారం లోక కళ్యాణార్థం శ్రీవారి కళ్యాణం నిర్వహిస్తామని ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు.

ఉత్సాహంగా వనభోజన మహోత్సవం



వీరశైవ సమాజం ఆధ్వర్యంలో



కాప్రా కాపుకులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో..

కుషాయిగూడ: కార్తీకమసాన్ని పురస్కరించుకొని కాప్రా సర్కిల్ వీరశైవ సమాజం ఆధ్వర్యంలో వాసవిశివనగర్, కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో ఆదివారం వీరశైవ వనభోజన మహోత్సం ఆత్మీయంగా సాగింది. ఈ కార్యక్రమానికి మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, గొల్లూరి అంజయ్యతో పాటుగా వివిధ పార్టీల నాయకులు నీలంరెడ్డి, మురళి పెద్ద ఎత్తున హాజరై అతిథ్యం స్వీకరించారు. ఈ సందర్భంగా అతిథులను ఘనంగాసత్కరించారు. సమాజ్ సభ్యులు బాలరాజు, యావపురం విశ్వనాథం పాల్గొన్నారు.

కుషాయిగూడ: కాప్రా కాపుకులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కాపుకులాల సామూహిక వనభోజన మహోత్సవం సందడిగా సాగింది. మధురనగర్ కోఆపరేటివ్ హౌజింగ్ సొసైటిలో కాపుకుల సంఘం అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బొండాడ ఇంజనీరింగ్ అధినేత బొండాడ రాఘవేంద్రరావు, ప్రైం9 సిఎండీ బండి రఘువీర్, యూస్‌లోని సిగ్నులు సాఫ్ట్‌వేర్ సంస్థ అధినేత రమణ క్రోసూరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

భక్తి శ్రద్ధలతో అయ్యప్ప మహా పడి పూజ

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ భవానీ నగర్‌లో జ్ఞానం గురుస్వామి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అయ్యప్ప మహా పడిపూజ భక్తి శ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా స్వామిని పూలు, పండ్లతో సుందరంగా అలంకరించారు. గురుస్వాములు ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మూగు నాగరాజు శర్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మాజీ కార్పొరేటర్



మల్కాజిగిరి: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని మల్కాజిగిరి డివిజన్ మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన సేవలందించాలి

మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: ఆరోగ్య శ్రీ ద్వారా మెరుగైన సేవలందించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశే ఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మల్కాజిగిరిలోని జిల్లా ఏరియా ఆస్పత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ఆయన ప్రారంభించారు. మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్య శ్రీ మొత్తాన్ని ఐదు లక్షల నుండి పది లక్షలకు పెంచడం హర్షణీయమైనప్పటికీ, మరి కొన్ని సేవలను చేర్చాల్సిన అవసరముందన్నారు. అప్పుడే పేద, మధ్య తరగతి ప్రజలకు ఉపయోగపడుతుందన్నారు. మహిళలు, ట్రాన్స్ జెండర్లకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మల్కాజిగిరి జిల్లా ఏరియా ఆస్పత్రిలో సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

కలిసిరండి..అభివృద్ధి చేద్దాం

ఎన్నికలు ముగిసాయని పార్టీలకు అతీతంగా కార్పొరేటర్లు కలిసివస్తే వారికి పూర్తిగా సహకరిస్తానన్నారు. ప్రజలు అత్యధిక మెజారిటీతో గెలిపించారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి పనులు చేస్తామన్నారు. అనంతరం ఆర్టీసీ బస్సును కార్పొరేటర్లతో కలిసి ప్రారంభించి దానిలో ప్రయాణం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రవణ్, రాజ్యలక్ష్మి, సునీతాయాదవ్, మేకల సునీతాయాదవ్ పాల్గొన్నారు.



ఉచిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి,కార్పొరేటర్లు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మేడ్చల్ : బండమాదారం సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా సోమవారం పలు గ్రామాలలో కరెంట్ సరఫరా ఉండని రూరల్ ఏఈ పవన్‌చంద్ తెలిపారు. శ్రీరంగవరం, బండమాదారం గ్రామాల్లోని అన్ని సర్వీసులకు ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

కీసర: చీర్యాల గ్రామంలో ఆదివారం అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా మేడ్చల్‌జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బర్లపాటి అరవింద్, ఎన్ఎస్‌యుఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్ము ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి గ్రామస్తుల నుండి మంచి స్పందన లభించింది. కార్యక్రమంలో సర్పంచ్ ధర్మేందర్, ఉపసర్పంచ్ జిల్లాల తిరుమల్‌రెడ్డి, సినీనటుడు సివిఎల్ నరసింహ్మారావు, మాజీ సర్పంచులు ,గ్రామస్తులు వివిధ పార్టీలనేతలు, తదితరులు పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతైన టీస్టాల్

ఘట్‌కేసర్: షార్ట్ సర్క్యూట్ కారణంగా టీటైం టీస్టాల్ అగ్నికి ఆహుతైన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. ఘట్‌కేసర్‌లోని జాతీయ రహదారి పక్కనే ఉన్న సర్వీస్ రోడ్డులో టీటైం టీస్టాన్‌ను బొక్కానిగూడకు చెందిన గడీల శేఖర్ రెడ్డి నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి స్టాల్‌ను మూసి ఇంటికెళ్లాడు. తిరిగి ఆదివారం ఉదయం స్టాల్‌ను తెరిచేందుకు వచ్చాడు. అప్పటికే షాపులో నుండి మంటలు, పొగ రావడంతో ఫైర్ స్టేషన్‌కు సమాచారమిచ్చాడు. అగ్నిమాపక సిబ్బంది స్పందించి మంటలను అదుపులోకి తెచ్చారు. మంటల్లో ఫ్రీజర్, క్యాష్ కౌంటర్ ఫర్నిచర్, చైర్లు, టేబుళ్లు, టీ స్టాకు, సీసీ కెమేరాల వ్యవస్థ, గ్యాస్ స్టవ్, సిలిండర్లు, కూల్ డ్రింక్స్, కంటెయినర్ షెడ్ కాలిపోయాయి. వీటి విలువ సుమారు రూ. 5 లక్షలు ఉంటుందని పోలీసులకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘటన జరగడానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రెండిళ్లలో చోరీ



శామీర్‌పేట్: ఇంటి తాళాలు పగులగొట్టి రెండు ఇళ్లలో చోరీకి పాల్పడిన సంఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు మండలంలోని అలియాబాద్ గ్రామానికి చెందిన విశ్వనాథ్ ఇంటితో పాటు మరో ఇంట్లో శనివారం అర్ధరాత్రి దుండగులు ఇంటి తలుపులు కటర్‌తో కట్ చేసి చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఒకరి ఇంట్లో విలువైన కెమెరా అహరణకు గురికాగా మరో ఇంట్లో చోరీ వివరాలు ఇంకా తెలియరాలేదు.



కాలనీ అసోసియేషన్ ఎన్నిక

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీ పరిధి హకీంపేట్‌లోని శివసాయి కాలనీ వాసులు ఆదివారం సమావేశమై కాలనీ అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షులుగా అమృతరెడ్డి, ఉపాధ్యక్షులుగా గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి విశాల్, కోశాధికారి రమాదేవి, కిరణ్,యాదగిరి, సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ కాలనీ సమస్యల పరిష్కారం, అభివృద్ధి కోసం పనిచేస్తుందని అధ్యక్షురాలు తెలిపారు.

ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయను



ఎమ్మెల్యేను గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

మల్లాపూర్ : ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయనని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి అన్నారు. ఉప్పల్ శాసనసభ్యుడిగా భారీ విజయం సాధించిన సందర్భంగా జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ ఆధ్వర్యంలో నాచారంలోని ఏఎస్ఆర్ గార్డెన్‌లో ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని అన్నారు. అనంతరం గజమాలతో బీఆర్ఎస్ నేతలు ఘనంగా సత్కరించారు. నాచారం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

స్వామివారి సేవలో నవీన్‌మిట్టల్



కీసర: చీర్యాల శ్రీ లక్ష్మీ నృసింహ్మస్వామి సేవలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ల్యాండ్ రెవెన్యూ రిజిస్ట్రేషన్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ కుటుంబసమేతంగా పాల్గొన్నారు.నవీన్ మిట్టల్ దంపతులకు ఆలయ వేదపండితులు పూర్ణకుంభస్వాగతం పలికారు. ప్రత్యేకపూజల అనంతరం ఆలయ వేదపండితులు స్వామివారి ఆశీర్వచనంతోపాటు, మహాప్రసాదాన్ని అందజేసారు.

కాలనీల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు

– నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి



అధ్యక్ష, కార్యదర్శులను అభినంధిస్తున్న మున్సిపల్ చైర్మెన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో సమస్యలను పరిష్కరించేందుకు పెద్ద ఎత్తున మున్సిపల్ నిధులను వెచ్చించి అభివృద్ధి పనులు చేపడతామని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని గోపికృష్ణకాలనీ అసోషియేషన్ నూతన కమిటీ ఎంపిక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ వాసులందరూ కలిసి కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేసుకోవడం అభినందనీయమన్నారు. అధ్యక్షుడుగా ఎంపికైన శ్రీనివాస చారి, ప్రధానకార్యదర్శి శ్రీధర్, కోశాధికారి నర్సింగ్‌రావులను అభినందించారు. మున్సిపల్ వైస్ చైర్మెన్ బండారి మల్లేష్ యాదవ్, కౌన్సిలర్ సుమిత్ర సురేష్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి అథ్లెటిక్స్

జవహర్‌నగర్: క్రీడాకారులు క్రీడా విలువలతో, ఉత్తమ శిక్షణతో ముందుకు వెళ్లాలని అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అబ్జర్వర్ డాక్టర్ నలుపోగుల స్వాములు అన్నారు. ఆదివారం తెలంగాణ క్రీడా పాఠశాలలో జిల్లా స్థాయి అండర్–14, 16 విభాగాలతో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అబ్జర్వర్ డాక్టర్ నలుపోగుల స్వాములు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. క్రీడాకారులు చిన్నప్పటి నుండే నైపుణ్యంతో కూడిన ఆటలు నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ జిల్లా అధ్యక్షులు ప్రభుకుమార్, సెక్రటరీ స్టాన్లీ జోన్స్, ఆర్గనైజర్ కూరపాటి రాజశేఖర్, సమ్మన్న పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

ఘట్‌కేసర్: రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీఆర్‌పీఎఫ్ మాజీ హవాల్దార్ కడమంచి సంజీవ అన్నారు. ప్రబుద్ధ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కుల నిర్మూలన, జాతి సమైక్యత భావాలు ప్రజల్లో పెంపొందాలన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘ ప్రతినిధులు మేకల దాస్, టి.బాలయ్య పాల్గొన్నారు.

వేడుకగా మినీ క్రిస్మస్

పోచారం: అన్నోజిగూడలోని క్రీస్తు జ్ఞాన మందిరంలో చిన్నారులతో మినీ క్రిస్మస్ కార్యక్రమాన్ని చర్చి నిర్వాహకురాలు నక్షత్రమ్మ మర్రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీస్తు జననం నాటికను చిన్నారులు ప్రదర్శించారు. ఆధ్యాత్మిక అంశాలపై చేసిన నృత్యాలు కనువిందు చేశారు.

సందడిగా కార్తీకమాస వన భోజనాలు



పోచారం: నారపల్లిలోని నందనవనంలో ఆదివారం కార్తీకమాస వన భోజనాలు సందడి జరిగాయి. నారపల్లి పరిసర ప్రాంతాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో నందనవనానికి విచ్చేసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా పెద్దలతో పాటు వచ్చిన పిల్లలు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఔత్సాహిక కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహ్లాదంగా కొనసాగాయి.

గౌడ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో కార్తీక వన భోజనాలు

కీసర: నాగారం, దమ్మాయిగూడ, కుషాయిగూడ గౌడ్స్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీకవనబోజనాల కార్యక్రమాన్ని ఆదివారం నాగారం మున్సిపల్ పరిధిలోని సువర్ణ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ టేబుల్‌టెన్నిస్ నైనా జైస్వాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండే కష్టపడి లక్ష్యం ఏర్పరచుకొని ముందుకెళ్లాలన్నారు కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

